

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి..!

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు సముద్ర తీరంలో ఆదివారం సందడి నెలకొంది. మండుతున్నఎండల ప్రభావం నుంచి ఉపశమనం పొందేందుకు జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు కోడూరు తీరానికి తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల రాకపోకలు సాగాయి. కుటుంబాల సమేతంగా తరలి వచ్చి తీరం వెంబడి సందడి చేశారు. ముఖ్యంగా యువత ఆటపాటలతో సందడి చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా తీరం వెంబడి ఎస్ఐ వీరేంద్ర బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు అయ్యింది. గతంలో సంభవించిన ప్రమాదాల దష్ట్యా పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. సముద్రంలో లోతుకు వెళ్ళకుండా విజిల్స్ వేస్తూ ప్రజలను పోలీసులు అప్రమత్తం చేశారు.అధిక సంఖ్యలో తరలి వచ్చిన ప్రజలతో కోడూరు సముద్ర తీరంలో పండుగ వాతావరణం నెలకొంది. ఏదేమైనా భారీ సంఖ్యలో తరలి వచ్చినపర్యాటకులతో కోడూరు బీచ్ కళకళ లాడుతూ కనిపించింది.

కార్పొరేషన్‌లో 'చెత్త' వ్యవహారం..!

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక వవైపు వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.. స్వచ్ఛాంధ్ర.. యోగాంధ్రా.. స్వర్ణాంధ్ర అంటూ ప్రోగ్రామ్స్ చేస్తున్నారు. నగరంలో చేపడుతోన్న అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడానికి కార్పొరేషన్‌లో చిల్లిగవ్వలేదు.. ఇదే క్రమంలో మున్సిపల్ చెత్త తొలగించే పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసు కుంటున్నారు. గత ప్రభుత్వంలో కార్పొరేషన్‌లో చెత్తతొలగించే వాహనాలు బ్యాంకుల నుంచి రుణం తీసుకొని చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు సీజ్ చేశారు. కొన్ని వాహనాలు ఇక్కడ నుంచి తీసుకెళ్లారు. ప్రభుత్వం కొత్త వాహనాలు కొనుగోలు చేయకుండా ప్రవేటు వ్యక్తులకు ట్రాక్టర్లుకు అనుమతి ఇవ్వడంతో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారపార్టీ నేతలకు ఆర్థికంగా సాయపడాలనే ఆలోచనతో ప్రయివేటు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ప్రతి నెల రూ 1.33 కోట్లు ఖర్చు పెడుతున్నారు. కార్పొరేషన్ సొమ్ముకు కొందరు వ్యక్తులు కన్నం వేస్తున్నా అధికారులు చూస్తు ఉండిపోతున్నారు.

-ఎన్ఎంసి వాహనాలు కొరత
-ప్రయివేటు వ్యక్తుల ట్రాక్టర్లు దందా
-నెలకు రూ 1.33 కోట్లు బిల్లులు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు కార్పొరేషన్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎస్ఆర్ నిధులతోపాటు, కార్పొరేషన్, ఇతర సంస్థల నుంచి వచ్చిన నిధులతో పెద్ద ఎత్తున ఖర్చుచేస్తున్నారు. నెల్లూరు నగరంలో మంత్రి పి. నారాయణ పార్కులు, పాఠశాలల మరమత్తులు చేయిస్తున్నారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రోడ్లు, డ్రెయినేజీ, పార్కులు, దర్గా వంటి పనులు పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఈ పనులకు బిల్లులు చెల్లించడానికి కార్పొరేషన్ వద్ద నిధులు లేవని తెలుస్తోంది. జనంపై వివిధ రకాలు పన్నులు విధించి కాంట్రాక్టర్లుకు బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలో చెత్త తొలగించడానికి ఎన్ఎంసి కోట్లు దొచిపెడుతొంది. నెల్లూరు కార్పొరేషన్‌లో ప్రతి రోజు 300 టన్నులు చెత్త వస్తుంది. 104 వాహనాలు ప్రస్తుతం తిరుగుతుండగా, వీటి ద్వార ప్రతి రోజు 217 టన్నుల చెత్త తొలగిస్తున్నారు. ఇందుకోసం టాటా ఏసిలు 40, టాటా ఇంట్రాలు 24, మినీ కంప్యాక్టర్లు 15, పెద్ద కంప్యాక్టర్లు 6, ట్రాక్టర్లు 9, భారత్ బెంజ్‌లు 2 లు రెండు ప్రతిరోజు చెత్త తీసుకెళుతున్నారు. ఒక్కో వాహనం 750 కేజీల నుంచి 20 టన్నుల వరకు తీసుకెళుతాయి. ఇటీవల వరకు అల్లీపురం, దొంతాలి

డంపింగ్ యార్డ్‌కు చెత్త తీసుకెళ్లి అక్కడే స్టోర్ చేశారు., ఇప్పుడు విజయవాడ తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో స్వచ్ఛాంధ్ర పథకం క్రింద అప్పటి నేతల పోత్సహంతో రెడ్డి ఎంటర్‌ప్రెజెస్ పేరుతో రాష్ట్ర వ్యాపితంగా 1000 వాహనాలు కొనుగోలు చేసినట్లు తెలిసింది. అందులో 90 వాహనాలు నెల్లూరు కార్పొరేషన్‌కు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ వాహనాలకు బిల్లులు రావని గ్రహించిన కాంట్రాక్టర్ తీసుకెళ్లిపోయారు. ఇప్పుడు కార్పొరేషన్‌లో వాహనాలు కొరత ఉన్నట్లు అధికారులు చెబతుఉన్నారు...

ప్రయివేటు వ్యక్తుల దందా..కోట్లు దొపిడి..!

నెల్లూరు కార్పొరేషన్‌లో చెత్తతొలగించే పేరుతో పెద్ద ఎత్తున ప్రజా ధనం దొపిడి జరుగుతొంది. కూటమి

ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 120 ప్రవేటు ట్రాక్టర్లును చెత్తతొలగించడానికి పెట్టుకున్నట్లు సమచారం. ఒక్కో ట్రాక్టర్‌కు ప్రతి రోజు రూ 3700 బిల్లు చెల్లిస్తున్నారు. ప్రతి రోజు రెండు నుంచి నాలుగు ట్రిప్పులు చెత్త తొలగించాల్సి ఉంటుంది. కార్పొరేషన్ ట్రాక్టర్లు పెద్దవిగా ఉండి, ఎక్కువ చెత్త తీసుకెళ్లడానికి అనువుగా ఉంటాయి. ఒక్కో ట్రాక్టర్‌కు 3 నుంచి 4 టన్నులు చెత్త తీసుకెళుతొంది. ప్రయివేటు ట్రాక్టర్లు కేవలం 1.5 టన్నులు మాత్రమే తూతూ మంత్రంగానే చెత్తతీసుకెళుతున్నాయి. కార్పొరేషన్‌లో 1200 పారిశుద్ధ కార్మికులు, 200 డ్రైవర్లు పనిచేస్తున్నారు. ఒక వేళ ట్రాక్టర్లు కావాలంటే ఇఎంఐ పద్దతిలో బ్యాంక్‌ల్లో తీసుకున్నా సరిపోతొంది. కార్పొరేషన్ అధికారులు అలా చేయకుండా అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతో తమ నాయకులు, కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించడానికి ట్రాక్టర్లు పెట్టినట్లు తెలుస్తోంది. నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ పరిధిలో ఇద్దరు నేతల కనుసైగల్లో ట్రాక్టర్లు దందా సాగుతుందనే సమాచారం. ప్రస్తుతం కార్పొరేషన్‌లో 120 ప్రవేటు ట్రాక్టర్లు చెత్తతీసుకెళ్లడానికి తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ట్రాక్టర్‌కు రోజు రూ 3700 చొప్పున, రోజుకి రూ 4.44 లక్షలు ఖర్చుపెట్టాల్సి వస్తుంది. నెలకి రూ 1.33 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐదు నెలల నుంచి ఇది సాగుతుండగా ఇప్పటికే రూ 6.65 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. కార్పొరేషనే కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేస్తే ప్రజా ధనం సద్వినియోగం అవుతుంది. అలా కాకుండా కొందరు వ్యక్తులకు సాయం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రజా ధనానికి అధికారపార్టీ నేతలు, అధికారులు తూట్లు పొడుస్తున్నారనే విమర్శలున్నాయి.

విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలి

జెఎల్ఎం-2లను (ఎనర్జీ అసిస్టెంట్లు)

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-నెల్లూరు

డిస్కం పరిధిలో జెఎల్ఎం-2లను ప్రభుత్వం నియమించిందని, వారందరినీ విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించి వారందరికీ ప్రమోషన్లు, బదిలీలు విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు నిర్వహిస్తున్న రీతిలో నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని నవాబుపేట, నరుకూరు రోడ్డు సమీపంలోని ఏవిఎం పంక్షన్ హాల్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జెఎల్ఎం-2 (ఎనర్జీ అసిస్టెంట్)ల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో జెఎల్ఎం-2 పాత్ర ఎంతో కీలకమైందని నరసింగరావు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో జెఎల్ఎం-2లు విద్యుత్తు వ్యవస్థను కాపాడుతున్నారన్నారు. అటువంటి వారి పట్ల ప్రభుత్వం వివక్షతో వ్యవహరించడం సరికాదన్నారు. వాస్తవానికి డిస్కంల పరిధిలోనే జెఎల్ఎం-2లను

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రభుత్వం అపాయింట్‌మెంట్ చేసిందని గుర్తు చేశారు. జెఎల్ఎం-2లకు ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలకు, డిస్కం ఉద్యోగులకు చెల్లిస్తున్న వేతనాలకు భారీ స్థాయిలో తేడాలు న్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ తప్పుడు విధానాలను సరిచేసేందుకు తక్షణమే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలెక్టర్లను కలిసి తమ న్యాయమైన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్తు మేనేజ్‌మెంట్ 2019 అక్టోబరు 2వ తేదిన ప్రతిష్ఠాత్మకంగా అప్పటి ప్రభుత్వం గ్రేడ్-2 జెఎల్ఎంల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసి 7529 మంది నియామకపు ఉత్తర్వులు అందజేసిందన్నారు.ఈ నేపథ్యంలో విద్యుత్తు శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు వర్తించే సౌకర్యాలన్నీ వారికి కల్పించాలన్నారు. సదస్సులో గ్రేడ్-2 జెఎల్ఎం రాష్ట్ర కన్వీనర్ పెంచలప్రసాద్, ఎస్‌కె జాకీర్‌హుస్సేన్, వెంకటేశ్వరరావు, వీరాంజనేయులు, నాయబ్‌రసూల్, బి.సుమన్, సునీల్, రసూల్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 8న 'చలో విజయవాడ'

ప్రజాశక్తి-నెల్లూరు : విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 8న జరిగే 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవతం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ సుమన్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. 14న గుంటూరులో యునైటెడ్ ఎలక్ట్రసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించామన్నారు. ముఖ్య ఉద్దేశ్యం విద్యుత్ సంస్థలో గత రెండు శతాబ్దాలుగా వెట్టి చాకిరి చేస్తూ సంస్థ పేరుకు కషి చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను సంస్థలోకి విలీనం చేసుకొని వారిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు.

జులై 3న వైఎస్ జగన్ రాక

-కాకాణితో ములాఖత్
-ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జైల్లో కలవడానికి జులై 3న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు రానున్నారని ఎంఎల్‌సి పి. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాయలంలో జగన్ ప్రోగామ్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం , మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ , ఎంఎల్‌సి గూడూరు సమన్వయకర్త మేరుగ మురళీధర్ సూళ్లూరుపేట సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. పర్వతరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ జిల్లాకు విచ్చేస్తున్నారు అన్న.. సమాచారం వచ్చిన ప్రతిసారి.. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పోలీసులు పీటీ వారెంట్ జారీ చేసి మరో చోటుకి తరలించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి పై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్న తీరు చూస్తే జిల్లాలో ఎన్నడూ ఇలాంటి సంస్కతి చోటు చేసుకో లేదన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి పై అక్రమ కేసులు ఒకదాని తర్వాత మరొకటి నమోదు చేసి పోలీసులు అక్రమంగా గోవర్ధన్ రెడ్డి గారిని నిర్బంధంలో తీసుకోవడం దుర్మార్గమన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ కేసులు విషయంలో.. జగన్మోహన్ రెడ్డి గారు ఎప్పటికప్పుడు విషయాలు తెలుసుకుంటూ వారి కుటుంబానికి అండగా ఫోన్లో పరామర్శించడం జరుగు తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సష్టించిన జులై 3న జగన్మోహన్ రెడ్డి జిల్లాకు విచ్చేసి కాకాణి గోవర్ధన్ రెడ్డితో ములాకత్ లో జిల్లా జైల్లో కలుస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కాకాణి గోవర్ధన్ రెడ్డి పట్ల వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని కాకాని పూజిత గారు అన్నారు. తన తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి మొదటినుంచి వైఎస్ఆర్సిపి క్యాడర్ మొత్తం అండగా నిలబడడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. జులై 3 వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు జిల్లాకు విచ్చేసి.. తన తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గారిని పరామర్శిస్తుండడం.. తమకెంతో ధైర్యంగా ఉందన్నారు. గోవర్ధన్ రెడ్డిని.. వారి కుటుంబ సభ్యులను నేరుగా కలిసి పరామర్శించాలన్న.. ఉద్దేశ్యంతో 3న వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాకు విచ్చేస్తున్నారని తెలిపారు.

మీడియాతో మాట్లాడుతోన్న ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు

రొట్టెల పండుగ నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ : మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన బారా షాహిద్ దర్గాలో ఈ ఏడాది అంగరంగ వైభవంగా రొట్టెల పండుగ నిర్వహించనున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణ అభివద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. జులై 6 నుంచి ఆరు రోజులపాటు జరగనున్న రొట్టెల పండగ ఏర్పాట్లపై శాఖల వారీగా మంత్రి సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పారిశుద్ధ్యం పై ప్రత్యేక ద్రుష్టి పెట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ మేరకు ఈ నెల 30 తేదీలోపు ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. నగర కమిషనర్ నందన్ , డీఎస్పీ సింధు ప్రియ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ , టిడిపి నేతలు గిరిధర్ రెడ్డి, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, వివిధశాఖల విభాగాధిపతులు ఉన్నారు.

ఫీజు పోరును జయప్రదం చేయండి : బుర్రా

ప్రజాశక్తి -కందుకూరు

వైసిపి అనుబంధ విద్యార్థి ,యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదిన జరగనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి కందుకూరు నియెజకవర్గ ఇన్‌ఛబుర్రా మధుసూదన్ యాదవ్ ఒక ప్రకటనలో విద్యార్థి యువజనలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫీజు రియంబర్స్మెంట్ను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా కల్లబొల్లి మాటలతో సంవత్సరకాలం కూటమి ప్రభుత్వం యువతను దగా చేసిందని విమర్శించారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

28న 'చలో తెనాలి'

ప్రజాశక్తి-కందుకూరు : తెనాలిలో దళిత, ముస్లిం యువకులపై దాడి చేసిన సిఐలు రాములు నాయక్, రమేష్ బాబులను అరెస్టు చేయాలని డిమాండ్ తో ఈనెల 28న చలో తెనాలి కార్యక్రమం జరుగుతుందని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను కందుకూరు అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులు ఆదివారం విడుదల చేశారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మాట్లాడారు. గత నెలలో తెనాలి అయితనగర్ కు చెందిన దళిత ,ముస్లిం యువకులను రౌడీల పేరుతో తెనాలి 2 టౌన్ సీఐ రాములు నాయక్ ,3 టౌన్ సిఐ రమేష్ బాబులు నడిరోడ్డుపై తాలిబన్ తరహా కిరాతక ఖాకీ లాఠీలతో హింసించారన్నారు. నేరాలకు న్యాయస్థానాలు శిక్షలు విధించాలే కానీ పోలీసులకు శిక్షించే అధికారం లేదన్నారు. పోలీస్ అధికారులు కేసులు నమోదు చేసి కోర్టులో నిరూపించి శిక్షలు వేయించాలే కానీ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే అధికారం పోలీసులకు లేదన్నారు. మాల మహానాడు రాష్ట్ర జెఏసి గౌరవ అధ్యక్షులు పాలేటి కోటేశ్వరరావు, కందుకూరు డివిజన్ మాల ఉద్యోగుల సంఘం, మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు లింగా బత్తిన బ్రహ్మయ్య, దారా అంజయ్య కట్టా రమేష్, దమ్ము థామస్, పర్రె శ్రీనివాసులు, రిటైర్డ్ డిఈఈ చెక్క సింగయ్య, పంది కోటేశ్వరరావు, దాసరి మల్లికార్జున ఉన్నారు.

మంత్రి నారాయణను కలిసిన డిపిఆర్ఓ

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి శివ శంకర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. డిఐపిఆర్ఓగా బాధ్యతలు చేపట్టిన శివ శంకర్‌రావు ఆదివారం చింతారెడ్డిపాలెంలోని నారాయణ మెడికల్ కళాశాలలో గల మంత్రి నివాసంలో మంత్రి నారాయణను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

29న 'భ. ని.కా' నగర మహాసభ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని మినీ బైపాస్ రోడ్డు సమీపంలోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఈనెల 29న భవనిర్మాణ కార్మిక సంఘం నగర మహాసభకు అధిక సంఖ్యలో భవన నిర్మాణ రంగానికి చెందిన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల పెంచలయ్య, ఆర్ శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలోని పలు డివిజన్లలో భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ముత్తుకూరు గేట్ సెంటర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాసులు రెడ్డి షేక్ అమీర్ లు, 15వ డివిజన్ పరిధిలోని తుమ్మల కట్ట సంఘం నందు అధ్యక్ష కార్యదర్శులుగా టి. మల్లి, టి. రాంబాబు ఎన్నికయ్యారు వారు మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ భవనిర్మాణ కార్మిక సంఘం నగర మహాసభకు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర, ,జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యంలో మహా సభలలో భవన నిర్మాణ కార్మికు సంఘంలో పనిచేసేటటువంటి వివిధ వత్తుల వారందరూ కూడా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు పి సూర్యనారాయణ నాయకులు కె సంపూర్ణమ్మ జే సుధాకర్ రావు అల్లంపాటి శ్రీనివాసులు రెడ్డి కె.వి రమణారెడ్డి ఎన్ వి సుబ్బమ్మ పి మహేష్ సింగ్ భాయ్ కోనయ్య ఉన్నారు. అనంతరం 13. మందితో కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షులు గా బాజావలి కార్యదర్శిగా ఖాదర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ అధ్యక్షులు ఖలీల్, సిఐటియు నాయకులు ఎం సుధాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

6న భ.ని.కా రూరల్ మహాసభ

జూలై 6న వేదాయపాళెం ప్రాంతంలోని కామ్రేడ్ మన్సూర్ భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ మహాసభ నిర్వహించనున్నట్లు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ తెలిపారు. ఆదివారం జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం 32 డివిజన్ భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం డైకాస్ రోడ్డు సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం

విఆర్ హైస్కూల్ అభివృద్ధే ధ్యేయం

మంత్రి పొంగూరు నారాయణ

ప్రజాశక్తి-నెల్లూరు

నేటి తన ఉన్నత స్థితికి కారణమైన వి ఆర్ సి పాఠశాలను అభివద్ధి చేయటం కనీస బాధ్యతగా భావించి ఆధునికరించినట్లుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.ఆదివారం నాడు అభివద్ధి చేస్తున్న వి ఆర్ సి పాఠశాల పనుల పురోగతి పనులను రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి లతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వినూత్నంగా ప్రవేశపెట్టిన పి - 4 పద్ధతిలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కషి చేస్తున్నామన్నారు. చిన్నతనంలో తనకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రస్తుత స్థితికి కారణమైన వి ఆర్ సి పాఠశాలను అభివద్ధి చేయటం కనీస బాధ్యతగా భావించానని, ఇందుకు తన కుమార్తెలు ముందుకు వచ్చి వి ఆర్ సి ఆధునీకరణలో భాగం పంచుకున్నారన్నారు. పేద, నిరుపేద విద్యార్థులకు ప్రాధాన్యతనిచ్చి వారికి అడ్మిషన్లు కల్పించడం జరిగిందన్నారు. అడ్మిషన్ల కోసం విపరీతమైన డిమాండ్ వచ్చిందన్నారు. దాంతో ఒకటి నుండి 9వ తరగతి వరకు రెండు సెక్షన్లకు బదులుగా మూడు సెక్షన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో అతి పేద విద్యార్థులను గుర్తించి ప్రవేశాలు కల్పించామన్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేసి అతి తొందరలో క్లాసులు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి 4 విధానంలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పారిశ్రామికవేత్త డి ఎస్ ఆర్ గ్రూపు ఆధ్వర్యంలో రెండు పాఠశాలను ఆధునికరిస్తామన్నారు.మంత్రి వెంట మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

24న వైఎస్ షర్మిల రాక

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 24న నగరానికి రానున్నట్లు డిసిసి అధ్యక్షులు చేవూరి దేవకుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలు స్థానిక ఇందిరా భవన్‌లో పార్టీ విస్తృత సమావేశం నిర్వహిస్తారని, నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర జిల్లా స్థాయి వివిధ కమటీలో ఉన్న నాయకులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, అనుసంబంద సంఘాల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

వైఎస్ షర్మిల, పిసిసి అధ్యక్షురాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : సోమిరెడ్డి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన తోటపల్లిగూడూరు మండలం కొత్తపాళెంలో శ్రీచెన్నకేశవ స్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. ఎంత మంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా రూ.13 వేలు చొప్పున ప్రభుత్వం నిధులు జమ చేస్తోందని సోమిరెడ్డి తెలిపారు. ఏదేని కారణంతో లబ్ధి చేకూరని వారికి జూలై 5వ తేదీ నుంచి నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. జులై నెలలో అన్నదాత సుఖీభవ పథకం కూడా అమలు చేయబోతున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి రూ.20 వేలు అందించబోతోందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం పథకం అమలుకానుందని ఆయన తెలిపారు. టిడిపి నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్ రెడ్డి, చింతా సీతారామయ్య, చేవూరు శ్రీనివాసులు ఉన్నారు.

వ్యర్థాల నిర్వహణకు చర్యలు : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలో ఆదివారం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు మున్సిపల్ కమిషనర్ అనూష , మున్సిపల్ అధికారులతో కలిసి గుణ్ణం కట్ట ప్రాంతాన్ని పరిశీలించారు.ఇటీవల గుణ్ణం కట్ట ప్రాంతంలో దుర్వాసన వస్తూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వచ్చిన ఫిర్యాదుతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు .స్థానిక ప్రజలతో ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ వ్యర్థాలను ఎవరు కూడా గుణ్ణం కట్టలో వేయరాదని సూచించారు. వేస్ట్ వాటర్ గుణ్ణంకట్ట లోకి పోకుండా త్వరలో నూతన కాలువ నిర్మాణం చేపడతామని ఎంఎల్ఎ తెలిపారు..గుణ్ణం కట్టకు తూర్పు వైపున ట్రాకింగ్, కట్టకు రివిట్ మెంట్ ఉండగా రెండో వైపు చుట్టూతా పదిహేను అడుగులు మేరా హద్దు బౌండరీ లైన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ గారికి సూచించారు. గుణ్ణంకట్ట చెరువులోకి వర్షపు నీళ్ళు వచ్చేందుకు, పోయేందుకు తూములు లేదా పెద్ద కాలువలు ఏర్పాటుకు పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులకు తెలిపారు.స్థానిక ప్రజల అందరి సహకారంతో గుణ్ణంకట్ట ప్రాంతాన్ని ఒక సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దుకున్నామని ఎంఎల్ఎ స్థానికులకు తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, వడ్డెళ్ళ రవిచంద్ర, బెజవాడ ప్రసాదు, కరిముల్లా, శ్రీనివాసులు, మదిరి మధు, షేక్ మున్న, భాష, పరిటాల రామకష్ణ, మురారి శెట్టి వెంకట సుబ్బారావు, మురారి శెట్టి సుధీర్, చక్క కేశవ, కోట కిషోర్, మోసంగి ప్రసాద్ ఉన్నారు.

గుడంకట్టను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ఎంఎల్ఎ నాగేశ్వరరావుకు స్వాగతం

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని గంగపాలెంలో ఆదివారం జరిగిన చెన్నకేశవ స్వామి కొలుపులు కార్యక్రమంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. చెన్నకేశవ స్వామికి జరిగిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. గ్రామంలో వేడుకగా జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.అత్తంటి రంగయ్య,అత్తంటి వెంకటేశ్వర్లు, అత్తంటి వెంకట్రావు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ, ఎంపి

ప్రజాశక్తి-కావలి

కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు ఆదివారం కావలి పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కావలి పట్టణంలో వివిధ పత్రికల్లో విలేకరిగా 40 సంవత్సరాల నుండి పని చేస్తున్న వార్త సీనియర్ జర్నలిస్ట్, ఆర్యవైశ్య నాయకులు ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు ఆదివారం నాగేశ్వరావు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాగేశ్వరావు కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. తన కలం ద్వారా అనేక సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరింప చేశారన్నారు. ఒక మిత్రుడిగా అనేక సలహాలు అందించేవారని తెలిపారు. నాగేశ్వరరావు లేని లోటు వ్యక్తిగతంగా తనకు లోటని తెలిపారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టిడిపి రాష్ట్ర సెల్ కార్యదర్శి, కావలి వాసి షేక్ ఖాదర్ భాషా కుటుంబ సభ్యులను కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు పరామర్శించారు. ముందుగా ఖాదర్ బాషా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, పట్టణ మైనార్టీ అధ్యక్షులు రహీం, టిడిపి నాయకులు, తిరివీధి ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు దేవకుమార్, పట్టణ మహిళా అధ్యక్షురాల అర్షియాబేగం, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ 'కాకర్ల'కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఉదయగిరి : మొదటిసారిగా శాసన సభ్యులుగా విజయం సాధించి చరిత్రను తిరగరాసే విధంగా మొదటి ఏడాది పాలనలోనే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతున్న శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు తెలుగుదేశం పార్టీ, మండల టిఎన్‌టియుసి అధ్యక్షులు ఫునా మేస్త్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దుర్గం కొండపై తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించిన శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది పాలన విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ తరపున టికెట్ తెచ్చుకొని మొదటి ప్రయత్నంలోనే ఎంఎల్ఎగా గెలిచిన కాకర్ల సురేష్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పట్టు వదలని విక్రమార్కుడిలాగా అభివృద్ధి వైపు ప్రయాణం సాగిస్తూ ముందుకు దూసుకెళ్తున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాలలో ఉదయగిరి నియోజకవర్గం గురించి గలమెత్తి తన వాణీని వినిపించి ఖచ్చితత్వంతో మెట్ట ప్రజల తరపున మాట్లాడిన ఒకే ఒక ఎంఎల్ఎగా చరిత్రలోకి ఎక్కారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ మొత్తం సుడిగాలి పర్యటన చేస్తూ ప్రతి సమస్య గురించి తానే క్షుణ్ణంగా తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్ రాబోయే రోజుల్లో ఉదయగిరిని అభివృద్ధి పథంలో నడిపిస్తాడని నమ్మకం ప్రజల కనిపిస్తుందన్నారు. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తన సమస్యలకు భావించి అభాగ్యుల కష్టాల కడలేనుండి బయటకు తీసుకొస్తున్నాడన్నారు. ఏడాదికాలం పూర్తి చేసుకున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పాలనలో ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు సంతృప్తితో ఉన్నారని రాబోయే కాలంలో కూడా ఇదేవిధంగా ఆయన పాలన కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో ఆయనకు మంత్రి పదవి కచ్చితంగా వస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు.

'నీరాజనం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కావలి : కావలి బాలసుబ్రహ్మణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ (బామా) వ్యవస్థాపక కార్యదర్శి, దార్శనీకులు, లేబాకుల సుధాకరరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కలయిక కళ్యాణ మండపంలో "నీరాజనం" పుస్తకావిష్కరణ చేసి, సుధాకర్ రెడ్డికి నీరాజనాలు అర్పించారు. సభాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, ముఖ్య అతిథి, విశ్రాంత నెల్లూరు సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ కాళిదాసు పురుషోత్తం, పొనుగోటి కృష్ణారెడ్డి, ఆత్మకూరు కల్లయ్య, బెజవాడ మహిలు కలిసి ఈ సంచికను ఆవిష్కరించారు. తొలి కాపీని సుధాకరరెడ్డి సోదరుడు విజయకుమార్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ అంతరించి పోతున్న కళలను వెలికి తీసి, కళారంగానికి సుధాకర్ రెడ్డి ఫిలిం సొసైటీ ద్వారా 15 ఏళ్ళు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. బామా సంస్థ ఏర్పాటు చేసి 20యేళ్ళ పాటు కళారంగానికి సేవచేశారని కొనియాడారు. "కనకపట్నం కావలండి", అంటూ సుధాకరరెడ్డి కాలం నుండి జాలువారిన గీతాన్ని, మరువలేము సుధాకరా.. అంటూ కావలి అపర ఘంటశాల సూరిశెట్టి రామచంద్రరావు ఆలపించారు. పాడుతా తీయగా" ఫేమ్, బాలగాన ప్రవీణ మాస్టర్ పర్వత రెడ్డి. అజిత్ రామ్ లలిత సంగీత విభావరి సభికుల మనసులను ఆకట్టుకుంది. చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ శ్రీ రామ్ మనోహర్ రెడ్డి వ్యాఖ్యతగా అలరించిన ఈ కార్యక్రమంలో కావలి పట్టణ పురప్రముఖులు సుధాకరరెడ్డి మిత్ర బృందం, బామా కార్యవర్గ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

సింహాచలంకు చెంచలబాబు నివాళులు

ప్రజాశక్తి-ఉదయగిరి : మాజీ ఎంఎల్ఎ సింహాచలం పెద్దకర్మలో ఆయన చిత్రపటానికి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచలబాబు యాదవ్ పాల్గొని పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాజువాక విశాఖపట్నం తన నివాసంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ తండ్రి మాజీ ఎంఎల్ఎ సింహాచలం పెద్దకర్మకు నెల్లూరు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చెంచలబాబు యాదవ్ తోపాటు సీతారాంపురం మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాసులు హాజరై సింహాచలం చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. అనంతరం చెంచల బాబు యాదవ్ మాట్లాడుతూ మనసున్న మహారాజు సింహాచలం అని ఆయన లేనిది తెలుగుదేశం పార్టీకి మనకు తీరని లోటని వ్యక్తపరిచి ఆ కుటుంబానికి దైవం మనోధైర్యం కల్పించాలని ఆయన కోరారు.



అంకాలమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి దుత్తలూరు : దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామం ఉలవవారిపాలెం మేకపాటి వంశస్థుల ఇంటి ఇలవేల్పు అయినా శ్రీ రవద్దూలి అంకాలమ్మ తల్లి పొంగళు ॢ స్థానికంగా ప్రతి సంవత్సరం నిర్వహించే అంకాలమ్మ తల్లి పాల పొంగళ్ళు ఈసారి కూడా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. అనంతరం మేకపాటి వంశస్థుల సమక్షంలో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. పొంగళ్ళతో తల్లి ఆశీస్సులు తీసుకునేందుకు భక్తులు ఉదయం నుండే తరలివచ్చారు. మేకపాటి వంశస్థుల మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాలతో పొంగళ్ళు చేసి తల్లికి నివేదించారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం సహా బంతి భోజనం కార్యక్రమం నిర్వహించారు.

గురు పౌర్ణమి ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని ద్వారకా నగర్ శ్రీ షిరిడి శేష సాయి బాబా మందిరంలో 29 సంవత్సరాలు గురుపౌర్ణమి వేడుకలను విగ్రహ ప్రతిష్ట నిర్వహించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవాలు జూలై 8, 9, 10 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించడానికి మందిర్ కమిటీ తీర్మానించినట్లు శేషసాయి మందిర్ వ్యవస్థాపక అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం తెలిపారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు కుటుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ట నిర్వహించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే గురు పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించామన్నారు. మూడోరోజు జులై 10న గురువారం విశేషంగా మహా అన్నదాన కార్యక్రమం, ఆధ్యాత్మిక మహాసభ మధ్యాహ్నం మూడు గంటలకు రాష్ట్రస్థాయి ఎద్దులతో బండలాగు బల ప్రదర్శన, సాంస్కృతిక భజన, కోలాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కనుక మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలలో వేలాదిమంది పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

60ఏళ్లు నిండిన కార్మికులందరికీ పెన్షన్ ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-బిట్రగుంట

60 సంవత్సరాలు దాటిన ప్రతి భవన నిర్మాణ కార్మికులకు రూ.10వేల పెన్షన్ను ఇవ్వాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు షేక్.చాన్‌బాషా పేర్కొన్నారు. ఇబ్రహీంపేటలోని మండల సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ సంఘ కార్మికుల మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాను కార్మిక నాయకులు, కార్మికులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని భవన నిర్మాణ కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు షేక్ చాన్‌బాషా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన సంక్షేమ పథకాలు గత ఆరు సంవత్సరాలుగా నిలిచిపోయాయని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. జిఒ నెంబర్ 12, 14లను జగన్ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను నిలిపివేశారని తెలిపారు. నిలిపివేసిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మండల సిపిఎం సీనియర్

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నాయకులు తుమ్మల వెంకయ్య, సిఐటియు కార్యదర్శి చల్లా నరహరి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు తుమ్మల సీనయ్య, మండల సిఐటియు అధ్యక్షులు ఎస్‌కె అన్వర్‌బాషా మాట్లాడుతూ కార్మికుల శ్రమను ప్రభుత్వాలు గుర్తించడం లేదని, ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు గ్రీన్ కార్పెట్ పరుస్తున్నాయని, కార్మికులకు రావాల్సిన హక్కులు మనమే పోరాడి తెచ్చుకోవాలని, మండలంలోని కార్మికులు కలిసి పోరాడి మన పిల్లల భవిష్యత్తు చదివించి మంచి భవిష్యత్తును వాళ్ళు కల్పించే విధంగా కలిసి పోరాడదమని తెలిపారు. కేంద్రం విడుదల చేస్తున్న భవన నిర్మాణ కార్మికుల నిధిని రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తుందని, గత ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూసిందని, గత ప్రభుత్వంలో కార్మికులు ఒక పూట అన్నం తినే పరిస్థితి కూడా కరువైందని తెలిపారు. ఇప్పుడున్న ఉన్న ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తుందని, కార్మికుల పోరాటంతోనే మనకు రావాల్సిన నిధులను మనకు ఖర్చుపెట్టేలా పోరాటంతో సాధించుకుందామని తెలిపారు. మండలంలోని భవన నిర్మాణ కార్మికులు ప్రతిఒక్కరూ యూనియన్‌లో చేరి వారి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, విశ్వనాథరావుపేట శాఖ కార్యదర్శి రామయ్య, భవన నిర్మాణ కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులు, కామ్రేడ్స్ తదితరులు పాల్గొన్నారు.

తీవ్రంగా గాయపడ్డ చిన్నారి

చిన్నారిపై అమానుషం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని కుడితిపాలెం కాకర్ల దిబ్బలో చిన్నారిపై అమానుష ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుడితిపాలెం కాకర్ల దిబ్బ ఎస్టీ కాలనీకి చెందిన గండలు చెంచమ్మ 10 ఏళ్ల చిన్నారిని సెల్‌ఫోన్ దొంగతనం చేసిందన్న అనుమానంతో పినతల్లితో కలిసి పక్కింటి వారు ఒంటిపై అమానుషంగా కాల్చిన గరిటెతో వాతలు పెట్టారు. బాధితురాలు చెంచమ్మ ఎవరికి చెప్పలేని స్థితిలో కన్నీటి పర్యంతమైంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ నాగార్జున రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి నిందితులు బండి శ్రీనివాసులు, కత్తి సుబ్బమ్మ, చలంచర్ల నాగరాజు, బండి సార్మ్యాడమ్మ, పిన్న తల్లి సన్నారి మాణిక్యంలను అదుపులోకి తీసుకున్నారు.

ఉపాధ్యాయుడు కొరివి రమణయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని నార్త్ కొండాయపాలెం ఎస్‌సి కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొరివి రమణయ్యను ఆదివారం మండల ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి కొనిగిపోగు వెంగయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు రమణయ్య ఈ పాఠశాలలో రెండేళ్లుగా సేవలందించారని తెలిపారు. విద్యార్థులు ఏ విధంగా క్రమశిక్షణలో మెలగాలని తీర్చిదిద్దారన్నారు. మెరుగైన విద్యను అందించి సాధారణ బదిలీల్లో భాగంగా తిమ్మారెడ్డిపల్లి పాఠశాలకు బదిలీ అవటం చాలా బాధాకరంగా ఉందని ఆయన అన్నారు. ఆయన సేవలు ఎన్నటికీ మరువలేమని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, స్కూల్ చైర్మన్ ఆర్.నాగమ్మ, అంగన్‌వాడీ టీచర్ భాగ్యమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యం చేస్తున్న డాక్టర్ సిరాజ్‌ఖానం

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మర్రిపాడు

డాక్టర్ బిఎస్‌ఆర్ హాస్పిటల్ ఆత్మకూరు వారి ఆధ్వర్యంలో డిసిపల్లిలోని ఆర్‌ఎంపి డాక్టర్ మాల్యాద్రి క్లినిక్ వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో హైదరాబాద్‌లోని విజయ, ఫెర్నాండేజ్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ పీడియాట్రిక్ నిపుణురాలు డాక్టర్ సిరాజ్ ఖానం పాల్గొని చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన పిల్లలకు ఉచిత వైద్యసేవలు అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 60మంది చిన్నారులను పరీక్షించి మందులు అందజేశారు. డాక్టర్ బిఎస్‌ఆర్ హాస్పిటల్‌లో పిల్లల ఆరోగ్య సమస్యలకు సంపూర్ణ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. త్వరలో పిల్లలకు అవసరమైన స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, శస్త్రచికిత్సల సేవలు ప్రారంభించనున్నామన్నారు. నవజాత శిశువులు, చిన్న పిల్లలకు ప్రత్యేక ఈవెనింగ్ క్లినిక్‌ను ప్రారంభించామని తెలిపారు. సెకండ్ ఒపినియన్ కోసం సంప్రదించడానికి డాక్టర్ బిఎస్‌ఆర్ హాస్పిటల్స్ బృందం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోందన్నారు.

విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఆదర్శ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆత్మకూరు వారి సౌజన్యంతో ఆదివారం తూర్పు చెన్నంపల్లి ఎస్‌సి కాలనీలో 52 మంది విద్యార్థులకు నోటుబుక్కు, జామెంట్ బాక్సులు, పరీక్ష ప్యాడ్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. కార్యక్రమంలో యజ్ఞం మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ అధికార ప్రతినిధి పి.ఎడ్వర్డ్, ఆదర్శ సేవాసంస్థ చైర్మన్ బక్క అదేయ్య, విద్యార్థిని తల్లిదండ్రులు, ఆదర్శ సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బక్క ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅన్నలూరులో ఇసుక మాఫియా

ప్రజాశక్తి, కలిగిరి

కలిగిరి మండలం, పెద్ద అన్నలూరు చెరువు నుండి అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతుండటం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. శనివారం అర్ధరాత్రి నుండి నిరంతరాయంగా ఒక జేసీబీ, పదిహేను ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఈ అక్రమ తవ్వకాలకు సంబంధించిన ఇసుకను కలిగిరి ఆర్ అండ్ బి బంగ్లా ఎదుట నిర్మిస్తున్న కాంప్లెక్స్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత పెద్ద ఎత్తున అక్రమ ఇసుక తరలింపు జరుగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ప్రజలు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపమే ఈ అక్రమ కార్యకలాపాలకు కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతరాయంగా ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, చెరువుల స్థితి దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నో చెరువులు ఇసుక తవ్వకాల కారణంగా తమ పూర్వ వైభవాన్ని

పెద్ద అన్నలూరులో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

కోల్పోయాయి. పెద్ద అన్నలూరు చెరువు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవడం, వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం వంటి దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు, సహజ వనరుల సంరక్షణకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు కోరుతున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టడానికి పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పురాతన ఆలయం పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

చేజర్ల మండలం పెరుమళ్ళపాడు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున ప్రాచీన శైవక్షేత్రం ఇసుక మేడల కింద ఇటీవలి కాలంలో వెలుగులోకి వచ్చిన పురాతన నాగలింగేశ్వర స్వామి ఆలయాని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సందర్శించారు. ఈ ఆలయం సుమారు 200 -300 సంవత్సరాల పురాతన చరిత్ర కలిగి ఉండగా, వాస్తవిక ఆధారాల ప్రకారం ఇది 19వ శతాబ్దం కాలానికి చెందినదిగా పురావస్తు నిపుణులు తేల్చారు. కాలక్రమేణా వరదలు, ప్రకృతి నీటి ప్రవాహాల కారణంగా ఆలయం ఇసుక మేడల కింద నిగూఢమైన ఆలయం నిక్షిప్తమైంది. గ్రామ పెద్దలు ఆలయ స్థితిని గుర్తు పెట్టుకున్నప్పటికీ ఈ మధ్యకాలంలో అనగా 2020 తర్వాత స్థానికుల చొరవతో ఆలయ భాగాలు బయటపడినాయి. ఇంత ఘనమైన చరిత్ర గలిగిన దేవాలయాన్ని నేడు దేవాదాయ శాఖ మంత్రి స్థానిక నాయకులు, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ "ఇది తెలుగు వారి గొప్ప సంస్కృతి, ఆధ్యాత్మిక పరంపరకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇలాంటి ఆలయం నెల్లూరు జిల్లా చేజర్ల మండలం పెరుమాళ్ళ పాడు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున ఉండటం జిల్లాకే తలమానికమని తెలిపారు.

మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అంత చరిత్ర కలిగిన ప్రాచీన దేవాలయం ఇసుక మేటలు తొలగి ఇటీవల వెలుగులోకి రావడం హర్షదాయకమన్నారు. దేవాదాయ శాఖ ఇటువంటి ప్రాచీన దేవాలయాలను, పూర్వ చరిత్రను, పవిత్రతను నిలబెట్టే దిశగా పని చేస్తుందన్నారు. ఇంత ఘనమైన చరిత్ర కలిగిన ఆలయం సంరక్షణ, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకునే దిశగా చొరవ తీసుకుంటాం, అలాగే గ్రామస్తులు కూడా ఆలయ పునర్నిర్మాణం పునఃపూజలు నిర్వహణ కోసం ఆసక్తి చూపుతున్నట్లు మంత్రి ఆనం తెలిపారు. అలాగే దేవాదాయ శాఖ పరిధిలో తీసుకునే విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టే దిశగా అధికారులకు ఆదేశాలు జారీచేస్తామని ప్రకటించారు. ఈ సందర్శనలో స్థానిక నేతల తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మస్తాన్ నాయుడు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం

మస్తాన్ నాయుడు కుటుంబానికి సంతాపం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు సాగునీటి సంఘం అధ్యక్షులు మాదాల మస్తాన్ నాయుడు గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మాదాల మస్తాన్ నాయుడు మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నెల్లూరు పాలెం ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి,నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయనవెంట టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంఎల్ఎ శ్రీహరి నాయుడు, తాళ్లూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులు నాయుడు, సుంకర పెంచలయ్య చౌదరి, కేత విజయభాస్కర్ రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తదితరులున్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బిట్రగుంట

ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆయుర్వేద డాక్టర్ కొర్ర చంద్రశేఖర్ తెలిపారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ క్రీడా మైదానంలో ఆదివారం బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కుందుర్తి శ్రీనివాసులు వారి కుమార్తె, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు గునుపూడి మల్లి పుట్టినరోజు సందర్భంగా క్రీడామైదానం కేక్ కట్ చేసి ప్రత్యేక ట్రీట్మెంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బర్నాడ్, గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, స్వర్ణన్ రాజ్, డాక్టర్ కొర్ర చంద్రశేఖర్, డాక్టర్ సాగర్ మాట్లాడుతూ యోగ అనేది మనిషిలో ఒక భాగం కావాలని, మానసిక ఒత్తిడి నుంచి బయటికి రావడానికి, శరీర ఆకృతిని పెంచుకోవడానికి, శరీరంలో ఉన్న రుగ్మతలను తొలగించుకోవడానికి, సమస్యల నుంచి బయట పడడానికి, ఆరోగ్యానికి ప్రధానమైన సూత్రంగా యోగా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జనార్ధన్, సత్యనారాయణ, మన్యం శ్రీనివాసులు, శేషు యాదవ్, శ్యాంసుందర్, జీవన్‌కుమార్, శేఖర్, ప్రవేట్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీహరి బాబు, మనోహర్ నాయుడు, అంతర్జాతీయ కరాటే మాస్టర్ రవి గన్, సీనియర్ జర్నలిస్ట్‌లు వెంకటేశ్వర్లు, ఏనుగుల ప్రభాకర్ రెడ్డి, తోటపల్లి ఎజ్రా, ఏనుగుల సంజయ్ రెడ్డి, ప్రభావతి, రైల్వే విశ్రాంతి ఉద్యోగస్తులు, యువకులు, ఆర్మీ విశ్రాంతి ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

మాట్లాడుతున్న ఎంపి బీద మస్తాన్‌రావు

ప్రజాశక్తి-కావలి

జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కావలిలోని బృందావనం కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి 'మిస్టర్ సింహపురి స్టీల్ మెన్ బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్ 2025' (7వ సారి) రాష్ట్రస్థాయి పోటీలు వైభవంగా నిర్వహించారు. ఎపి బాడీబిల్డింగ్ ప్రోగ్రాం ఆర్గనైజర్, జిల్లా బాడీబిల్డింగ్ సెక్రటరీ బి.జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఇండియన్ బాడీబిల్డర్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ స్వామి రమేష్‌కుమార్, ఆంధ్ర బాడీబిల్డర్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ, డి.ఎస్.పి. శ్రీధర్ కూడా ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరుఅయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150మంది క్రీడాకారులు 10 విభాగాలలో పోటీపడతారని తెలిపారు. ప్రతి రౌండ్‌లో ఐదు బహుమతులు అందజేశారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పేరొందిన బాడీబిల్డర్లు ఈ పోటీలలో పాల్గొనడం శుభ పరిణామమని వారన్నారు. ఒకప్పుడు భారతదేశం నుండి బాడీబిల్డర్లు తక్కువగా ఉండేవారని, నేడు అంతర్జాతీయ స్థాయిలో భారతీయ బాడీబిల్డర్లకు మంచి పేరుందని ఆనందం వ్యక్తంచేశారు. గతంలో బాడీ బిల్డింగ్ కోసం కావలిలో హనుమాన్ వ్యాయామసాల ఉండేదన్నారు. ధర్మవరం శేషయ్య మిస్టర్ ఇండియా విజేత బ్రాహ్మణక్రాక నివాసి కావలి ప్రాంతానికి గుర్తింపు తెచ్చారన్నారు. అయన మేనల్లుడు జగన్ అయన వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇప్పటికి 7సార్లు రాష్ట్రస్థాయి పోటీలను జరిపారన్నారు. ఈ సందర్భంగా జగన్‌ను ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి, ఎం.పి. బీద మస్థాన్ రావు అభినందించారు. ఈ పోటీలలో మహిళల ఫిజిక్ మోడలింగ్‌కు విశేష ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ పోటీలకు సహకరించిన వివిధ పార్టీ నాయకులకు, వైద్యులకు, దాతలకు నెల్లూరు జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ బి.జగన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ఉమెన్ మోడల్ ఫిట్‌నెస్ ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్ సంజన (ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్), అర్జున్ అవార్డు గ్రహీత నేషనల్ భాస్కరన్ పాల్గొన్నారు. డాక్టర్ కె.మాధవరెడ్డి నేతృత్వంలో ఈ సభా కార్యక్రమాలు జయప్రదంగా జరిగాయి.

'యువత పోరు' విజయవంతం చేయండి..

ప్రజాశక్తి దుత్తలూరు

ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో సోమవారం నెల్లూరు కలెక్టరేట్ వద్ద నిరసనలను విజయవంతం చేయాలని దుత్తలూరు మండల వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నెల్లూరు కేంద్రమైన కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు నిరసన కార్యక్రమానికి మండలంలోని వైసిపి నాయకులు కార్యకర్తలు నిరుద్యోగులు పాల్గొనాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతను చంద్రబాబు మోసం చేస్తున్నాడని ఎన్నికల్లో నిరుద్యోగులుకు విద్యార్థులకు హామీలు ఇచ్చి గెలిచాక వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ద్రోహన్ని ప్రశ్నించే సమయం వచ్చిందన్నారు. ఏడాదికాలం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా నటన చేస్తూ పబ్బం గడుపుతున్నాడన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎగనామం పెట్టిన చంద్రబాబు మోసాన్ని నిలదిద్దాం.. ఈ కూటమి ప్రభుత్వ కుటిల రాజకీయాలను ఎండకడద్దాం.. అని దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు.